సంక్షేమంపై విస్తృత ప్రచారం



గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి పిలుపు

ముదిగుబ్బ: సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. గృహ సారథులు జగనన్న సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముందుకు సాగాలన్నారు. వందలకొద్దీ అపద్దపు హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చకపోగా ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ మూడేళ్లలోనే నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ వ్యవస్థ ద్వారా కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను ఇంటిముంగిటకే చేరుస్తున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల విధులను ఎమ్మెల్యే తెలియజేశారు. ఎంపీపీ ఆదినారాయణ, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాగుండ్ల భాస్కర, చెంద్రాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ సారథులు.. జగనన్న రథ సారథులు

తనకల్లు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు జగనన్న రథసారథులు అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ పోలం సిద్దారెడ్డి ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సోమవారం శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి ఇంటింటికి వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు ఎంతవరకు అందుతున్నాయో తెలుసుకోవాలన్నారు. తనకల్లు మండలంలో 20 నుంచి 30 గ్రామాలకు రోడ్లు వేయించామన్నారు. తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా హంద్రీ–నీవా జలాలతో అన్ని చెరువులను నీటితో నింపామని చెప్పారు. 30 పడకల ఆసుపత్రిలో డాక్టర్ల కొరతను తీర్చి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా దోచుకుతిన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు సురేష్‌రెడ్డి, నాగేంద్ర, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు హిమధర్‌రెడ్డి, ఆదినారాయణ, జయప్రద, ఈశ్వరప్ప, శ్రీనివాసులు, ఆసుపత్రి డైరెక్టర్ రామ్‌దేశాయ్, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మెన్ కొండా మల్లికార్జున, మండల సచివాలయాల కన్వీనర్ హేమశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ పూల శీనా, నాయకులు శ్రీనివాసులనాయుడు, సిద్దారెడ్డి, బాబా, నీలకంఠారెడ్డి, బీఎస్ నిజాం, రహంతుల్లా, చిన్నప్పరెడ్డి, శ్రీహరిరెడ్డి, రామకృష్ణ, నారాయణ తదితరులున్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

గాండ్లపెంట: రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి పంటల సాగుకు చేయూత ఇవ్వడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మలమీదపల్లి సమీపంలోని మేకలచెరువు రోడ్డు వద్ద ఏపీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.2.50 కోట్లతో కొత్తగా నిర్మించే 11/33 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలమీదపల్లి పరిసర గ్రామాల రైతులకు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌తో ఇబ్బందులు తీరుతాయన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం అడగ్గా వెంటనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముబారక్ తన 1.35 సెంట్ల విలువైన స్థలాన్ని ఉచితంగా విద్యుత్‌శాఖ అధికారులకు రిజిస్టర్ చేసి ఇచ్చారన్నారు. స్థల దాతను ఎమ్మెల్యే, గ్రామస్తులు సన్మానించారు. ఇంకా నియోజకవర్గంలో మరో 4 విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరు కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ మోహనమ్మ, నాయకులు ప్రతాపరెడ్డి, చలపతి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, అమానుల్లా, శివారెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌నాయుడు, జేఎస్‌సీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్లు లోకేశ్వరరెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సే జగనన్న లక్ష్యం

తలుపుల: పేదల శ్రేయస్సే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. స్థానిక టీచర్స్‌కాలనీ, కుమ్మరపేట, యూనియన్ బ్యాంకు వరకూ ఎంపీపీ రఫినాయక్, ఉపసర్పంచ్ డిక్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ సీసీ రోడ్లు వేయించాలని, విద్యుత్ పోళ్లు మార్చాలని కోరారు. కుమ్మరపేట ఎగువన వర్షపునీరు వచ్చి చాలా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్‌లు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ పోళ్లు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని, వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజ్ ఏర్పాటుకు ఆదేశించారు. అనంతరం కుమ్మరపేటలోని హజ్రత్ సయ్యద్ బాబా షర్ఫోద్దీన్ దర్గా ఆవరణలో నమాజు కట్ట వద్ద ఉపసర్పంచ్ డిక్‌బాబు సొంత నిధులతో వేయనున్న కాంక్రీట్ పనులకు ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, పయాజ్ అహమ్మద్, సర్పంచ్‌లు టోపీరమణ, షేక్షావలి, పెద్దినాయుడు, సుదర్శన్ రెడ్డి, శీనానాయక్,దివాన్‌వలి, అగ్రి బోర్డు చైర్మన్ చెన్నక్రిష్టారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

నేడు గడప గడపకూ..

ఓడీచెరువు: ఓడీ చెరువులోని ఎస్సీ కాలనీలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మద్దే రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గడప గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, వాటివల్ల ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు గృహసారథులకు శిక్షణ తరగతులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని గీతామందిరంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు

ధర్మవరం అర్బన్: చదువును ఇష్టంతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్స్ పుస్తకాలను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు పండిట్ జయసింహ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కత్తె పెద్దన్న, యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణనాయక్, కార్యదర్శులు హరికృష్ణ, రామంజినేయులు, పాఠశాల హెచ్‌ఎం నాగేంద్ర, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు

కనగానపల్లి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు రోజూ పౌష్టికాహారం ఇవ్వాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలకు సిబ్బంది తలుపులు వేసి, ధర్నాకు వెళ్లారు. చిన్నారుల ఆకలిని పక్కనపెట్టి, మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. అంగన్‌వాడీల బంద్‌పై స్థానిక ప్రజలకు ముందస్తు సమాచారం లేకపోవటంతో చిన్నారులు, మహిళలు కేంద్రాల వద్దకు వచ్చి తలుపులు వేయటాన్ని చూసి నిరాశగా వెనుదిరిగి వెళ్లారు.

12న కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 12న నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు సోలిగాళ్ల వెంకటేశులు, క్యాంపు చైర్మన్ నరేంద్రరెడ్డి, సత్రసాల ప్రసన్నకుమార్, బీవీ చలం, శివయ్య, సుదర్శన్‌గుప్త తెలిపారు. స్థానిక రోటరీక్లబ్‌లో సోమవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నల్లచెరువు: మండల కేంద్రంలో నివాసముంటున్న గాజేఖాన్‌పల్లికి చెందిన పూజారి శాంతమ్మ (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి సోమవారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, మాజీ సర్పంచ్ రవికుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

కదిరి అర్బన్: మొబైల్ ఎన్‌రోల్‌మెంట్‌తో ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ సుధామణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీవరకు 4 రోజుల పాటు సచివాలయాల పరిధిలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. 7న కేఎస్‌పాళెం జెడ్పీ హైస్కూల్, 8న ముత్యాలచెరువు ఎంపీపీ పాఠశాల, 9న కదిరి బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, 10న ఎగువపల్లి ఎంపీపీ పాఠశాలలో అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు.

బత్తలపల్లి మండలంలో..

బత్తలపల్లి: మండలంలో నాలుగు రోజులు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. 7న బత్తలపల్లి–1 (బాలుర ఉన్నత పాఠశాల), తంబాపురం (సంగాల పంచాయతీ కార్యాలయం), సంజీవపురం (సచివాలయం) పంచాయతీల్లో, 8న బత్తలపల్లి–2 (బాలికల ఉన్నత పాఠశాల), రామాపురం సచివాలయం, సంజీవపురం సచివాలయం, 9న అప్పరాచెరువు, డి.చెర్లోపల్లి, ఈదుల ముష్టూరు, 10న పోట్లమర్రి, దంపెట్ల, మాల్యవంతంలో ఎన్‌రోల్, అప్‌డేట్ చేస్తారన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు

కనగానపల్లి: మండలంలో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మండల వ్యాప్తంగా నాలుగు మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ప్రజల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయిస్తామన్నారు. మండల కేంద్రం కనగానపల్లిలోని మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు తగరకుంట, మామిళ్లపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఒక్కో కేంద్రంలో రోజుకు నాలుగు సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజల ఆధార్ కార్డులు పరిశీలించి, అప్‌డేట్ చేస్తారన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

బత్తలపల్లి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ, పీఈటీ లాల్‌బాషా తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ విజయనగరంలో జరిగిన కబడ్డీ పోటీల్లో యు.వెంకటప్రసాద్(9వ తరగతి), ఆర్చరీలో 10వ తరగతి విద్యార్థి కార్తీక్ ఎంపికైనట్లు తెలిపారు. అదేవిధంగా చిత్తూరులో జరిగిన పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు 6వ తరగతి విద్యార్థి అరవింద్ ఎంపికైనట్లు తెలిపారు. ఆదివారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో బత్తలపల్లి పాఠశాలతో పాటు ఎంజేపీ రెండు పాఠశాలలు కలిసి జట్టుగా ఏర్పడి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, పీఈటీతో పాటు ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థి..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ క్యాంపు కబడ్డీకి బత్తలపల్లి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి కె.ఎర్రిస్వామి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా ఆదివారం జరిగిన ఆర్డీటీ కబడ్డీ లీగ్ పోటీలలో ఆర్డీటీ జట్టు విజయం సాధించినట్లు తెలిపారు. అందులో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల నుంచి హరిచరణ్, హరీష్, అశోక్, కిరణ్, అజయ్‌కుమార్, విష్ణులు ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు మానసిక ప్రశాంతత అవసరం

తనకల్లు: విద్యార్థులకు మానసిక ప్రశాంతత అవసరమని రిటైర్డ్ ప్రొఫెసర్ నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం యోగ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏకాగ్రత అవసరమన్నారు. ప్రతిరోజూ యోగ చేయడంతో ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. పాఠశాలలో ఈ నెల 20వ తేదీ వరకు అంటే 15 రోజుల పాటు యోగ తరగతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాలగుడి వెంకటేశ్వరనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

బత్తలపల్లి: స్పందన కార్యక్రమంలో అందే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో 8 అర్జీలు అందినట్లు తెలిపారు. భూమి కొలతలకు రెండు అర్జీలు, ఇంటి స్థలాలకు రెండు, భూ సమస్యలపై నాలుగు అర్జీలు అందినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సాయిమనోహర్ తదితరులు హాజరయ్యారు.

కరాటే పోటీల్లో పతకాలు

కదిరి అర్బన్: విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 3,4,5వ తేదీల్లో జరిగిన 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కదిరి పట్టణానికి చెందిన 12 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. పోటీల్లో నేపాల్, భూటాన్ దేశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని కరాటే మాస్టర్ షాకీర్ తెలిపారు. కటా, కుమితే విభాగంలో 12 మంది విద్యార్థులు పతకాలు సాధించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



ఓబుళంపల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్ అందించారు. ఈ సందర్భంగా పలువురు తమకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని అడిగారు. వెంటనే ఇళ్ల పట్టాలను అందించాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా విమర్శలు చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలీ, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, సర్పంచు చెన్నారెడ్డి, ఎంపీటీసీ వెంకట రెడ్డి, నాయకులు సానే రాజారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహా రెడ్డి, కరి క్రిష్టప్ప, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రామగిరి మండలంలో..

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురం పంచాయతీ రెడ్డివారిపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు స్థానిక నాయకులు వెంకటరెడ్డి, రామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు.

షెడ్లకు బహిరంగ వేలం

ధర్మవరం: పట్టణంలోని కొత్త కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో అదనంగా నిర్మించిన 21 షెడ్లకు నెలసరి అద్దె ప్రాతిపదికన బహిరంగ వేలాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నిర్వహించారు. రూ.16,090 ధర నిర్ణయించగా చిరువ్యాపారులు మొత్తం 21 షెడ్లకు రూ.31,400 పాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్‌లు శివ, డీఈ ఒన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో ఎమ్మెల్యే దుద్దుకుంట



తులాభారం ద్వారా బెల్లం సమర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

గుంతకల్లు రూరల్: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం వేకువజామున ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేర్లతో ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ప్రసాదం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తులాభారం ద్వారా స్వామికి బెల్లం కానుకగా సమర్పించారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం



బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణమని మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్‌లు యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం మూడు నూతన ఆర్టీసీ బస్సులను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆర్టీసీ యూనియన్ల నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, జేసీబీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉడుముల రాము తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సర్వ సభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్‌నాయక్ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సన్మానం

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన పాలెం సూర్యనారాయణను పద్మశాలి సంఘం తరఫున మంగళవారం స్థానిక శ్రీ భక్త మార్కండేయ స్వామి శివాలయంలో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఆలయ వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

పేరూరులో నవగ్రహ విగ్రహ ప్రతిష్ట

రామగిరి: పేరూరులోని భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ట జరిగినట్లు ఆలయ అర్చకుడు రామకృష్ణస్వామి తెలిపారు. ఉదయాన్నే ప్రత్యేక అర్చనలు, హోమాలతో రాహు, కేతువు, బృహస్పతి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

ధర్మవరం అర్బన్: దుర్గానగర్‌లో నూతనంగా పునఃనిర్మించిన శీతలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి 12 వరకూ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నకృష్ణ, బెస్త రామకృష్ణ తెలిపారు. ఆలయంలో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. రోజూ హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. 12న విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఉంటుందన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గాండ్లపెంట: కటారుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేశ్వరమారుతి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతపై అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఎలా సంక్రమిస్తుందో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ దుర్గ, ఆరోగ్య పర్యవేక్షకులు ఉపేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దళితులకు పట్టాలివ్వాలి

ఎన్పీకుంట: అర్హులైన దళితులకు అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తాలుకా అధ్యక్షుడు రెడ్డప్ప మాదిగ కోరారు. సోమవారం తహసీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందించారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కోరారు.

ట్రస్టు సేవలు తండాలకు విస్తరించాలి

ప్రశాంతి నిలయం: శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను గిరిజన తండాలకు విస్తరించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు అన్నారు. సోమవారం ట్రస్ట్ సభ్యుడు రత్నాకర్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. ఏదైనా స్కిల్ డెవలప్మెంట్ సదుపాయం కల్పించాలని కోరారు. మొబైల్ హాస్పిటల్ సేవలను విస్తరింపజేయాలని విన్నవించారు. కార్యక్రమంలో చక్రి నాయక్, వెంకటరమణ నాయక్, ప్రసాద్ నాయక్, సతీష్ నాయక్, రంగలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీలో ఏరియాస్థాయి క్విజ్ పోటీలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో సోమవారం ఏరియా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించినట్లు ఏటీఎల్ రుక్మాంగద తెలిపారు. ప్రథమ బహుమతి పోట్లమర్రి టీం, ద్వితీయ బహుమతిని తాడిమర్రి మండల టీమ్‌లు దక్కించుకున్నట్లు వివరించారు. ఈ టీమ్‌లు ఫిబ్రవరి 28న బత్తలపల్లిలో జరిగే రీజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కిషోర్, రవి, ఆర్డీటీ సిబ్బంది వెంకటేష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

నల్లమాడ: దొన్నికోట గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం స్పర్శ కుష్టు వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీహెచ్‌ఓ రామాంజులు, సూపర్‌వైజర్లు సాలమ్మ, మంజుల మాట్లాడుతూ రాగి రంగులో స్పర్శ లేకుండా ఉండే మచ్చలను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే కుష్టు వ్యాధిని నివారించవచ్చన్నారు. సర్పంచ్ రాగినేని సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు బాలాజీనాయుడు, ఆరోగ్య సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

12న విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: న్యామద్దల గ్రామంలో ఈ నెల 12న కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు అనంతరం విగ్రహ ప్రతిష్ట ఉంటుందన్నారు.

'బంజారా' యూత్ ప్రెసిడెంట్‌గా అనిల్‌నాయక్

కదిరి అర్బన్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా యూత్ ప్రసిడెంట్‌గా కదిరి పట్టణానికి చెందిన అనిల్‌నాయక్‌ను ఆ సంఘం నాయకులు ఎన్నుకున్నారు. సోమవారం పుట్టపర్తిలో కార్యక్రమం నిర్వహించారు.

సేవాలాల్ ఉత్సవాలు జయప్రదం చేయండి

కదిరి అర్బన్: ఈ నెల 13,14,15 తేదీల్లో గుత్తిలో జరిగే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని గిరిజన విద్యార్థి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్‌నాయక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

మహమ్మద్ షేక్ రియాజ్ బాష, S/o Late మహమ్మద్ షేక్ రసూల్ బాష, పాస్‌పోర్ట్ No. G4677999 పాస్‌పోర్ట్ Issued Date 30-8-2007, Hyderabad అనంతపురం పోవుటకు ఇంటి నుంచి టూవీలర్‌లో బస్టాండుకు పోవుచుండగా జారి క్రింద పడిపోయినది. ఎవరికైనా దొరికినచో క్రింది Ref. No. Phone చేయగలరు 9966175008. M.S.Riyaz Basha, Kadiri.